ఇంతలోనే ఎంతమార్పు..!

- ఐదు నెలల్లోనే తిరగబడ్డ ఓటర్లు
- అసెంబ్లీకి ఒకరకంగా, పార్లమెంటుకు మరో రకంగా తీర్పు
- అసెంబ్లీ నుంచి పార్లమెంటు నాటికి 54 వేలకు తగ్గిన బీఆర్‌ఎస్ ఓట్లు
- పార్లమెంటులో బీజేపీ, కాంగ్రెస్‌లకు పెరిగిన ఓట్లు

ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గంలో అసెంబ్లీ నుంచి పార్లమెంట్ వరకు జరిగిన ఎన్నికల్లో భారీ వ్యత్యాసం కనిపిస్తోంది. గడచిన ఐదు నెలల కాలంలోనే నియోజకవర్గ ఓటరు పూర్తి భిన్నంగా తన తీర్పును వెలువరించారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులకు వచ్చిన ఓట్లు పార్లమెంటు ఎన్నికల్లో ఈ మూడు పార్టీ అభ్యర్థులకు వచ్చిన ఓట్లు ఏ మాత్రం పొంతన లేకుండా ఉండటమే ఇందుకు నిదర్శనంగా చెప్పొచ్చు.

- ఓటరు నాడి పసిగట్టడంలో ఆయా పార్టీల నేతలు, అభ్యర్థులు పూర్తిగా వైఫల్యం చెందినట్లు స్పష్టంగా కనిపిస్తుంది. ఇదే రకమైన తీర్పు గత 2018, 19 సంవత్సరాల్లో జరిగిన అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో కూడా ఓటర్లు ఇవ్వడం గమనార్హం.

53,763 ఓట్లు కోల్పోయిన బీఆర్‌ఎస్...

2023 డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్‌కు 75,200 ఓట్లు లభించాయి. ఇదే నియోజకవర్గంలో పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేసిన బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌కు 21,444 ఓట్లు మాత్రమే వచ్చాయి. అంటే అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసిన ముఠా గోపాల్ కంటే పార్లమెంటు అభ్యర్థిగా పోటీ చేసిన పద్మారావుగౌడ్‌కు ఈ నియోజకవర్గంలో 53,763 ఓట్లు తక్కువ రావడం గమనార్హం.

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి పెరిగిన ఓట్లు...

అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి పూస రాజుకు 35,423 ఓట్లు పోల్ అవ్వగా, సికింద్రాబాద్ పార్లమెంటు బీజేపీ అభ్యర్థి జి.కిషన్‌రెడ్డి ముషీరాబాద్ నియోజకవర్గంలో 77,116 ఓట్లు రావడం గమనార్హం. అంటే పూస రాజు కంటే జి.కిషన్‌రెడ్డికి 41,693 ఓట్లు అధికంగా పోల్ అయ్యాయి.

- అంజన్‌కుమార్ యాదవ్ రెండు నెలల పాటు ఎంతో కఠోర ప్రచారం నిర్వహించినా 37 వేల ఓట్లే రాగా పార్లమెంటు ఎన్నికల్లో కనీసం అభ్యర్థి దానం నాగేందర్ గానీ, కాంగ్రెస్ నేతలు గానీ ఎలాంటి ప్రచారం నిర్వహించకుండానే 12 వేల ఓట్లు అధికంగా రావడం రాజకీయ విశ్లేషకులను ఆశ్చర్యానికి గురి చేస్తుంది.
- ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు 37,797 ఓట్ల మెజార్టీ వచ్చినా పార్లమెంటు ఎన్నికల్లో 54 వేల ఓట్లు తక్కువ రావడం కూడా రాజకీయ నేతలను ఆశ్చర్యానికి గురి చేస్తుంది. గతంలో బీఆర్ఎస్‌కు వచ్చిన ఓట్లను అటు బీజేపీ, మరో వైపు కాంగ్రెస్ పార్టీలు చీల్చుకున్నట్లు స్పష్టంగా అర్థం అవుతుంది.

పెరిగిన కాంగ్రెస్ ఓట్లు...

అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి అంజన్‌కుమార్ యాదవ్‌కు 37,410 ఓట్లు పోలవగా సికింద్రాబాద్ పార్లమెంట్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన దానం నాగేందర్‌కు ముషీరాబాద్ నియోజకవర్గంలో 49,435 ఓట్లు పోల్ అయ్యాయి. అంటే అసెంబ్లీ అభ్యర్థి అంజన్‌కుమార్‌యాదవ్ కంటే దానం నాగేందర్‌కు 12,025 ఓట్లు అధికంగా లభించడం గమనార్హం.

చట్టవిరుద్ధ గోవధశాలలను మూసివేయాలి



మాట్లాడుతున్న శాలివాహన పండరినాథ్

కవాడిగూడ: రాష్ట్రంలో చట్ట విరుద్ధంగా కొనసాగుతున్న గోవధ శాలలను తక్షణమే మూసివేసి ప్రతి జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో గోశాలలను ఏర్పాటు చేసి అక్రమణలో ఉన్న గోచర భూములకు విముక్తి కల్పించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. గోరక్ష చట్టాలు అమలు చేయాలని, గో హంతకులను శిక్షించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఇందిరా పార్కు వద్ద దేశీ గోవంశ రక్షణ సంవర్ధన సమితి, గోరక్ష విభాగం, విశ్వ హిందూ పరిషత్ తెలంగాణ సంయుక్త ఆధ్వర్యంలో గో మహాధర్నా నిర్వహించారు. ధర్నాలో స్వామి కమలానంద భారతి, ఆలిండియా మఠ్ మందిర్ అధ్యక్షుడు రామరాజు, విశ్వహిందూ పరిషత్ కార్యదర్శి శాలివాహన పండరీనాథ్, కన్వీనర్ శివరాం, తెలంగాణ రాష్ట్ర గో ప్రముఖ్ ఇనంపల్లి వెంకన్న, గో రక్ష సహ ప్రముఖ్ జి. రమేష్, బాలకృష్ణ గురుస్వామిలు మాట్లాడుతూ... దేవాదాయ శాఖ పరిధిలోని అన్ని ఆలయాలలో గోశాలలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గో ఆధారిత వ్యవసాయం చేస్తున్న రైతులకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహకాలను అందించాలన్నారు. నగరంలోని బోరబండ, నార్సింగి తదితర ప్రాంతాలలో నిర్వహిస్తున్న పశువుల సంతలను తక్షణమే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. గోవధ నిషేధంపై తెలంగాణ హైకోర్టు ఆర్డర్‌ను వెంటనే అమలు చేయాలన్నారు. ధర్నాలో రావినూతన శశిధర్, ఆకుతోట రామారావు, సుభాష్, పండరీనాథ్, డాక్టర్ శ్రీనివాస్, పలువురు స్వామిజీలు, గో ప్రేమికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ కార్యకర్తలను ఆదుకుంటాం



బీఆర్‌ఎస్ నాయకుడు కొండా సహదేవ్‌ను పరామర్శిస్తున్న ముఠా జైసింహ

ముషీరాబాద్: ఆపదలో ఉన్న పార్టీ కార్యకర్తలను అన్ని విధాల ఆదుకుంటామని బీఆర్ఎస్ గ్రేటర్ యువజన కమిటీ సీనియర్ నాయకుడు ముఠా జైసింహ అన్నారు. శుక్రవారం ముషీరాబాద్ డివిజన్ బాపూజీనగర్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వరల్డ్ గిన్నిస్ బుక్ రికార్డు గ్రహీత కొండా సహదేవ్ కిడ్నీ వ్యాధితో అనారోగ్య పాలయ్యాడని తెలుసుకొని ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. అన్ని విధాలా అండగా ఉంటామని, అవసరమైతే వైద్య పరీక్షలు చేయిస్తామని హామీ ఇచ్చారు. వారి కుటుంబ సభ్యులను కలిసి ఆయన ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు డి.శివముదిరాజ్, మహంకాళీ దేవాలయ కమిటీ చైర్మన్ ఎయిర్‌టెల్ రాజు, ముషీరాబాద్ డివిజన్ మాజీ అధ్యక్షుడు భిక్షపతియాదవ్, గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు రాకేష్‌కుమార్, డివిజన్ ఉపాధ్యక్షులు శ్రీనివాస్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాల ప్రమాదాలపై జీహెచ్‌ఎంసీ అప్రమత్తం

హిమాయత్‌నగర్: హైదరాబాద్ మహానగరంలో వర్షాకాలంలో జరిగే ప్రమాదాలపై జీహెచ్ఎంసీ అప్రమత్తమయింది. నగరంలో తరుచూ వస్తున్న భారీ వర్షాలు, వరదలు నీటి ముంపు వలన ప్రాణాపాయ పరిస్థితులు, ఆస్తినష్టం జరుగుతున్నందున ముందు జాగ్రత్తలు ఎలా తీసుకోవాలి, ప్రమాదం జరిగినప్పుడు ఏమి చేయాలి అనే విషయాలపై ఒక రోజు ట్రైనింగ్ ప్రోగ్రాం ఏర్పాటు చేయనున్నట్లు జీహెచ్ఎంసీ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం జూన్ 10 తేదీన జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఫత్తుల్లగూడ, నాగోల్ ట్రైనింగ్ సెంటర్ వర్షాకాలపు ప్రమాదాల గురించి అవగాహన, సమాచారం, జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో డిజాస్టర్ మేనేజ్మెంట్ విభాగం వారు ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిగే ఈ ట్రైనింగ్ లో మధ్యాహ్నా భోజనం ఏర్పాటు చేస్తారు. సోమవారం తరువాత కూడా ఆసక్తి ఉన్న వారు సంప్రదిస్తే ఈ ట్రైనింగ్ ఏర్పాటు చేస్తారు. ఆర్‌డబ్ల్యుఎంలలో అపార్ట్‌మెంట్‌లలో పని చేసే సిబ్బంది, బస్తీల్లో నివసించే ప్రజలు, ఎన్‌జీవో సభ్యులు, ట్రేడ్ యూనియన్ సభ్యులు, ఇతరులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవటం చాలా అవసరమన్నారు. వివరాలకు ఎస్ఎఫ్ఓ శ్యాంసుందర్ రెడ్డిని ఫోన్: 79817 75687 ద్వారా సంప్రదించాలని తెలియజేశారు.

వేటూరి ప్రభాకర శాస్త్రి విమర్శనా వ్యాస రచనకు ఆద్యుడు



వేటూరికి నివాళులర్పిస్తున్న దృశ్యం

చిక్కడపల్లి: వేటూరి ప్రభాకర శాస్త్రి విమర్శనా వ్యాస రచనకు ఆద్యుడని ప్రభుత్వ విశ్రాంత ఉన్నతాధికారి జి.దేవిప్రసాద్ అన్నారు. శుక్రవారం రాత్రి శ్రీ త్యాగరాయగానసభ నిర్వహణలో కళా లలితకళావేదికలో కవి, రచయిత వేటూరి ప్రభాకర శాస్త్రి యాదిలో శీర్షికతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవిప్రసాద్ మాట్లాడుతూ... సంస్కృతాంధ్ర భాషల్లో ప్రతిభ కలిగిన వేటూరి తెలుగు జాతికి సాహిత్య సంపద అందించారని కొనియాడారు. సమాజాన్ని ప్రభావితం చేసిన మహనీయుల సంస్మరణ, జయంతి కార్యక్రమాలను త్యాగరాయ గానసభ నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రముఖ గాయకుడు సి.హెచ్.త్రినాథరావు మాట్లాడుతూ... ప్రభాకరశాస్త్రి చిన్న వయస్సులోనే అవధాన విద్యలో ప్రావిణ్యం పొందారన్నారు. కార్యక్రమానికి త్యాగరాయ గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి అధ్యక్షత వహించగా రచయిత్రి కేతవరపు రాజ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సమస్యల పరిష్కారానికి చేయాలి

ఐఎన్టీయూసీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ అంబటి కృష్ణమూర్తి



నియామకపత్రం అందుకుంటున్న సతీష్‌బాబు

హిమాయత్‌నగర్: సంఘటిత, అసంఘటిత కార్మికులు సమస్యలతో సతమతం అవుతున్నారని, వారి సమస్యల పరిష్కారానికి యువ ఐఎన్టీయూసీ నేతలు కృషి చేయాలని ఐఎన్టీయూసీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ అంబటి కృష్ణమూర్తి కోరారు. శుక్రవారం బషీర్‌బాగ్‌లో జరిగిన కార్యక్రమంలో ఐఎన్టీయూసీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా డేగల సతీష్ బాబును అంబటి కృష్ణమూర్తి నియమించారు. ఈ మేరకు నియామక పత్రాన్ని ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా అంబటి మాట్లాడుతూ... కార్మికులకు సరసమైన జీవన వేతనంతో స్థిరమైన ఆర్థికవృద్ధి, వృత్తిపరమైన ఆరోగ్య భద్రత, సురక్షితమైన ఉపాధి,సామాజిక రక్షణ వంటి సమస్యలపై ఐఎన్టీయూసీ ఎన్నో విజయవంతమైన పోరాటాలు చేసి కార్మికుల హక్కుల రక్షణకు పాటుపడుతుందని తెలిపారు. ఐఎన్టీయూసీ జాతీయ కార్యదర్శి బి.నాగరాజు, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గుంజ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గూడా ఐలయ్య గౌడ్, నేతలు జేమ్స్, గురు ప్రసాద్ రావు, వికాస్ సింగ్, అనిల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'పని చేయని నాయకులపై చర్యలు తీసుకోవాలి'



తేజగౌడ్

ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గంలో అసెంబ్లీ, ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల కోసం పని చేయని నాయకులపై పార్టీ చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు తేజగౌడ్ పార్టీ అధిష్టానాన్ని కోరారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఐక్యతతో పని చేస్తే దానం నాగేందర్ గెలిచేవారని అన్నారు. పార్టీలోని గ్రూపులు సమన్వయలోపం వల్లే దానం నాగేందర్ ఓటమి చెందారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం రాంనగర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికల్లో అమలు చేసిన అయిదు గ్యారంటీ పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లి లబ్ధిదారులు పార్టీకి ఓటు వేసే విధంగా నియోజకవర్గం నాయకులు అంకితభావంతో పని చేయలేదన్నారు. కేవలం నాయకులు తూతూ మంత్రంగా పని చేయడం వల్ల ముషీరాబాద్‌లో దానం నాగేందర్‌కు ఆశించిన మెజార్టీ ఓట్లు రాలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ముషీరాబాద్ నియోజకవర్గంలో బలంగా ఉందని కొందరు నాయకులు పని చేయకపోవడం వల్లనే 49 వేల పై చిలుకు ఓట్లు వచ్చాయని అందరూ బాగా పని చేస్తే 80 వేల ఓట్లు వచ్చేవని దాంతో నాగేందర్ గెలిచేవారన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన ఎం.అంజన్‌కుమార్‌యాదవ్‌కు కొంత మంది నాయకులు పని చేయకుండా అన్యాయం చేశారని, వారిపై పార్టీ అధిష్టానం క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. పార్టీ పటిష్టత కోసం పని చేసిన వారికి తగిన గుర్తింపు కల్పించాలని ఆయన కోరారు.

రేవంత్‌రెడ్డి పాలనలో రాష్ట్రాభివృద్ధి



భువనగిరి ఎంపీని సన్మానించిన శ్రావణ్‌కుమార్

ముషీరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో తెలంగాణ రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని భువనగిరి ఎంపీగా విజయం సాధించిన చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ కమిటీ కో ఆర్డినేటర్ ముషీరాబాద్‌కు చెందిన గండి శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని కలిసి శాలువాలు కప్పి మెమోంటో అందజేసి సన్మానించారు. పార్టీ నాయకులు మురళి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్న గెలుపు పట్ల హర్షం



నల్లకుంట: మున్నూరు కాపు ముద్దు బిడ్డ తీన్మార్ మల్లన్న వరంగల్, నల్లగొండ, ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీగా గెలుపొందడం పట్ల మున్నూరు కాపు ఐక్య పోరాట సమితి అధ్యక్షుడు కొండూరు వినోద్ కుమార్, ప్రధాన కార్యదర్శి, టీపీసీసీ ఓబీసీ సెల్ వైస్ చైర్మన్ కట్టెల సుభాష్, 1969 తెలంగాణ ఉద్యమకారుడు పుంజాల దత్తుమూర్తి హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం సాయంత్రం తీన్మార్ మల్లన్నను కలిసిన వారు శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

యువకుడి అదృశ్యం



డి.ప్రకాష్

కాచిగూడ: ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమైన ఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ పి.రవికుమార్ సమాచారం మేరకు... బర్కత్‌పురాలోని రుక్కుస్ యెల్లు ఆర్కెడ్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న డి.రమ కుమారుడు డి.ప్రకాష్ (24) కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. పనికి వెళ్తున్నానని చెప్పి ఇంట్లో నుంచి ఈ నెల 5వ తేదీన ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. వివిధ ప్రాంతాల్లో, తెలిసిన వారి ఇండ్లలో ఎంత వెదికినా ఆచూకి లభించలేదు. దీంతో తల్లి రమా కాచిగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడి అదృశ్యం



సబావత్ రూక్‌లాల్

కాచిగూడ: వాకింగ్ కోసం వెళ్లిన ఓ వృద్ధుడు అదృశ్యమైన ఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ పి.రవికుమార్ సమాచారం మేరకు... నెహ్రూనగర్‌కు చెందిన చంద్రు కుమారుడు సభావత్ రూక్‌లాల్(60) గురువారం రాత్రి ఇంట్లో నుంచి వాకింగ్ కోసం వెళ్లి తిరిగి రాలేదు. పలు ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించనందున అతని భార్య శాంతమ్మ కాచిగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీసీ కుల గణన చేపట్టాలి

తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ



మాట్లాడుతున్న ఎర్ర సత్యనారాయణ

ముషీరాబాద్: కేంద్రంలో కొత్తగా కొలువుదీరిన ఎన్‌డీఏ ప్రభుత్వం దేశవ్యాప్తంగా కులగణన చేపట్టి అందులో బీసీ కుల జనాభాను కూడా లెక్కించాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ కోరారు. శుక్రవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ కులగణన చేపట్టిన జేడీయూ(నీతిష్), రామ్ విల్వాస్ పాశ్వాస్ పార్టీలను ఆయన అభినందించారు. ఎన్‌డిఏ భాగస్వామ్యమైన తెలుగు దేశం పార్టీ కూడా ఈ ఏజెండాకు మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికలలో బీసీ కుల గణన ప్రధాన ఏజెండాగా కేంద్ర రాష్ట్రాలలో అనూహ్య ఉన్నత ఫలితాలు పొందినందున రాష్ట్రంలో సంపూర్ణ కుల గణన జరపాలని కోరారు. మారిన రాజకీయ పరిస్థితుల్లో చంద్రబాబు కేంద్ర రాజకీయాల్లో కీలకమైన సందర్భంలో తెలంగాణ రాష్ట్రం అస్తిత్వం కోల్పోయే ప్రమాదం ఉందని అన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గజ్జ కృష్ణ, తెలంగాణ రాష్ట్ర బీసీ ఫ్రంట్ చైర్మన్ గోరిగే మల్లేష్‌యాదవ్, నీల వెంకటేష్, పి.సుధాకర్, రాజ్‌కుమార్, వేముల రామకృష్ణ, అనంతయ్య, రేగుల మధుసుధన్‌రావు, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం పుణ్యకార్యం



అన్నదానం చేస్తున్న మాత వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అన్నదానం మహాదానం అని పేదలకు అన్నదానం చేయడం ఎంతో పుణ్యకార్యమని మాత వాకర్స్ క్లబ్ నల్లకుంట అధ్యక్షుడు డాక్టర్ వై.మురళీధరుడు అన్నారు. శుక్రవారం వీఎస్టీలోని కట్టమైసమ్మ అమ్మవారి దేవాలయం వద్ద వైశాక మాసాన్ని పురస్కరించుకొని మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు సుమారు 400 మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం సామూహిక గో పూజను నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవా కార్యక్రమాలను విస్తృతం చేయడానికి సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.పుల్లయ్య దంపతులు 20 వేలు, కరణం చంద్రశేఖర్ 2 వేలు, పద్మప్రియ 5 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో శిరిడీ సాయిబాబా ఆశ్రమం ప్రతినిధులు జగన్, గోపి, మాత వాకర్స్ క్లబ్ కోశాధికారి కోనేరు జైహింద్, కార్యదర్శి అల్లాడి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు డాక్టర్ నీలా శ్రీధర్, మారం సురేష్‌బాబు, సలహాదారులు కేశవరావు దేశ్‌పాండే, హైదరాబాద్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎలక్ట్ లింగప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్‌కుంద్రా మనీలాండరింగ్ కేసు పేరుతో మోసం

హిమాయత్‌నగర్: మనీలాండరింగ్ కేసులో తమ ఆధార్ వివరాలు ఉన్నాయని భయపెట్టి ఓ ప్రైవేట్ ఉద్యోగిని సైబర్ నేరగాళ్లు భారీగా మోసం చేశారు. నగర సైబర్ క్రైమ్ పోలీసుల సమాచారం మేరకు... సికింద్రాబాద్‌కు చెందిన 32 ఏళ్ల ఓ ప్రైవేట్ ఉద్యోగికి టెలికాం డిపార్ట్‌మెంట్ నుంచి అంటూ సైబర్ నేరగాళ్లు వాట్సాప్ కాల్ చేశారు. ఆ కాల్ సీబీఐ కార్యాలయానికి బదిలీ చేశామని, తన ఆధార్ కార్డ్ వివరాలు రాజ్‌కుంద్రా కేసుకు సంబంధించి మనీలాండరింగ్ కేసులో ఉన్నాయని.. బాధితుడికి ఆ కేసుతో సంబంధాలు ఉన్నాయని భయపెట్టారు. మరుసటి రోజు కాల్ చేసి బాధితుడిని తన మొబైల్ స్క్రీన్ చేయాలని, తనకు కేసుకు సంబంధం లేదని నిరూపించుకువాలంటే తన ఐసీఐసీఐ బ్యాంక్ ఖాతా నుంచి డబ్బును బదిలీ చేయమన్నారు. వెరిఫై చేసి రెండు రోజుల్లో డబ్బులు తిరిగి ఇస్తామని హామీ ఇచ్చారు. వారు చెప్పిన విధంగా బాధితుడు రూ. 10 లక్షలు బదిలీ చేశాడు. అనంతరం వారు స్పందించకపోవడంతో మోసపోయానని బాధితుడు నగర సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ శివమారుతి తెలిపారు.

ట్రేడింగ్ పేరుతో వ్యాపారికి రూ.15 లక్షల టోకరా

హిమాయత్‌నగర్: స్టాక్ మార్కెట్ ట్రేడింగ్‌లో అధిక లాభాలు వస్తాయని నమ్మించి ఓ వ్యాపారిని సైబర్ నేరగాళ్లు భారీగా మోసం చేశారు. నగర సైబర్ క్రైమ్ పోలీసుల సమాచారం మేరకు... నగరానికి చెందిన ఓ వ్యాపారవేత్త వాట్సాప్ నంబర్‌కు బ్లాక్‌స్టోన్, ఎయిట్ రాడ్స్ గ్రూప్ నుంచి మెసేజ్ వచ్చింది. బాధితుడిని ఓ వాట్సాప్ గ్రూప్‌లో యాడ్ చేసి ట్రేడింగ్ సూచనలు ఇస్తామని, మంచి లాభాలు వచ్చే స్టాక్స్‌లో పెట్టుబడులు పెట్టాలని గ్రూప్ల సందేశాలు పంపిస్తూ నమ్మించారు. గ్రూప్‌లో లింక్ పంపించి సైబర్ నేరగాళ్లు సృష్టించిన నకిలీ ట్రేడింగ్ అప్లికేషన్‌ను ఇన్‌స్టాల్ చేయమని బలవంతం చేశారు. అనంతనం వారు యాప్‌లో స్టాక్ మార్కెట్ బిజినెస్ కోసం అతని ఖాతాలో రూ.15 లక్షలు పెట్టుబడి పెట్టాలని బాధితుడిపై ఒత్తిడి తెచ్చారు. వారు చెప్పిన విధంగా ట్రేడింగ్ చేస్తే 5 నుంచి 25 శాతం వరకు లాభాలు వస్తాయని నమ్మించారు. అనంతరం వారు ఐపీవోలలో పెట్టుబడులు పెట్టించారు. లోన్ తీసుకొని మరింత పెట్టుబడులు పెడితేనే ఐపీవో షేర్లు కేటాయిస్తామని, రుణం తీసుకొని పెట్టుబడులు పెట్టాలని, లేదంటే ట్రేడింగ్ అకౌంట్‌ను రద్దు చేయాలని, బాధితుడి నిధులను స్తంభింపజేస్తామని బెదిరించారు. దీంతో మోసపోయానని తెలుసుకున్న బాధితుడు నగర సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సైబర్ క్రైమ్ ఏసీపీ శివమారుతి తెలిపారు.

ఏఐసీసీ మైనార్టీ చైర్మన్‌తో బుర్హానుద్దీన్ భేటీ

బంజారాహిల్స్: పార్లమెంటు ఎన్నికల్లో కర్ణాటక రాష్ట్రం మైనార్టీ కాంగ్రెస్ డిపార్ట్‌మెంట్ ఇన్‌చార్జి బాధ్యతలతో ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఫిలింనగర్‌కు చెందిన సీనియర్ మైనార్టీ కాంగ్రెస్ నేత సయ్యద్ బుర్హానుద్దీన్ ఢిల్లీలో జరిగిన సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు శుక్రవారం ఆయన ఏఐసీసీ మైనార్టీ చైర్మన్, రాజ్యసభ సభ్యుడు ఇమ్రాన్ ప్రతాప్ గర్హితో సమావేశం అయ్యారు. తాను ప్రచారం నిర్వహించిన పార్లమెంటు స్థానాల్లో కాంగ్రెస్ ఫలితాలు, ఓట్ల సరళిపై సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన మైనార్టీ కాంగ్రెస్ నేతకు కర్ణాటకలో ప్రచార బాధ్యతలు అప్పగించినందుకు రాహుల్ గాంధీకి కృతజ్ఞతలు తెలిపారు.

23న బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక

చిక్కడపల్లి: అఖిల బ్రాహ్మణ సమాభివృద్ధి సంస్థ (ఏబీసీడీఓ) చిక్కడపల్లి ఆధ్వర్యంలో శ్రీఘ్రవివాహాల కోసం కన్యా వరపాశుపత హోమాలు, 82వ బ్రాహ్మణ ఉచిత మెగా వివాహ పరిచయ వేదికను నిర్వహించనున్నట్లు సంస్థ కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎస్.సుబమణ్యం తెలిపారు. ఈ నెల 23న (ఆదివారం) న్యూనల్లకుంటలోని సహకార గృహ నిర్మాణ సంస్థ కమ్యూనిటీ హాల్‌లో వివాహ పరిచయ వేదికను ఏర్పాటు చేస్తామన్నారు. జంటనగరాల్లో 50 వసంతాలుగా సేవలు అందిస్తున్న ఏకైక బ్రాహ్మణ సేవా సంస్థ అయిన ఏబీసీడీఓ నిర్వహించే ఈ కార్యక్రమాల్లో పాల్గొనే ఆసక్తి ఉన్నవారు ఈ నెల 10వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలను ఫోన్స్: 93906 46539, 91004 14469, 94928 66204లలో సంప్రందిచాలన్నారు.

మున్నూరుకాపు కార్పొరేషన్‌కు రూ. 2 వేల కోట్లు కేటాయించాలి



మంత్రి పొన్నంను కలిసిన నేతలు

కాచిగూడ: మున్నూరుకాపు కార్పొరేషన్‌కు రూ. 2 వేల కోట్ల నిధులను మంజూరు చేయాలని మున్నూరుకాపు సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండ దేవయ్య పటేల్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఆర్.వి.మహేందర్ కుమార్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కొండ దేవయ్య నేతృత్వంలో శుక్రవారం మున్నూరుకాపు సంఘం ప్రతినిధులు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మున్నూరు కాపులకు ప్రభుత్వ నామినేటెడ్ పదవుల్లో, పార్టీ పదవుల్లో తగిన ప్రోత్సాహం కల్పించాలని కోరారు. జిల్లాల్లో మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహాల ఏర్పాటు కోసం కుల సంఘాల భవన నిర్మాణాల కోసం రూ. 5 కోట్లు నిధులు, రెండు ఎకరాల స్థలం కేటాయించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు.

భక్తి, సంప్రదాయ కీర్తనల్లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నల్లకుంట: నల్లకుంటలోని శ్రీ సాయి శృతి మ్యూజిక్ అకాడమీలో భక్తి, సంప్రదాయ కీర్తనల్లో శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ప్రతి సోమ, గురువారాల్లో సాయంత్రం 5.30 గంటల నుంచి మొదటి బ్యాచ్, ప్రతి మంగళ, శుక్రవారం ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు రెండో బ్యాచ్‌లో శిక్షణ తరగతులు ఉంటాయని అకాడమీ డైరెక్టర్ గౌరీభట్ల వసుధామూర్తి తెలిపారు. ఇందులో అన్నమయ్య కీర్తనలు, సాయిబాబా భక్తి గీతాలు, శివ శక్తి, రామ భక్తి గీతాలు, పెళ్లి పాటలు, మంగళ హారతుల పాటల్లో శిక్షణ ఉంటుందన్నారు. టీవీ, ఆలిండియా రేడియో కళాకారుడు గౌరీభట్ల లక్ష్మణ మూర్తి స్వీయ పర్యవేక్షణలో శిక్షణ ఉంటుందని చెప్పారు. వయోపరిమితి లేదని తెలిపారు. వివరాలను ఫోన్: 83749 27736లో సంప్రదించాలన్నారు.

బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచాలి

కాచిగూడ: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 20 శాతం నుంచి 42 శాతంకు పెంచాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం గుజ్జ కృష్ణ నేతృత్వంలో బీసీ సంఘం ప్రతినిధులు నంద గోపాల్, వేముల రామకృష్ణలతో తెలంగాణ రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి బీసీల డిమాండ్లపై చర్చించారు. అనంతరం అనకు బీసీల సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్‌బీఐ డీజీఎం రవీంద్ర

నల్లకుంట: నల్లకుంట ఎస్‌బీఐ ఆధ్వర్యంలో శుక్రవారం బాగ్ అంబర్‌పేట డీడీ కాలనీలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి పరిసర ప్రాంతాల ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్‌బీఐ డీజీఎం రవీంద్ర హిట్నల్లి శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయా ప్రాంతాలలో ఏర్పాటు చేసే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ హిమాయత్‌నగర్ రీజనల్ మేనేజర్ రవి శంకర్, నల్లకుంట బ్రాంచి చీఫ్ మేనేజర్ జీవీడీ వరప్రసాద్ రావు, టీపీసీసీ ఓబీసీ సెల్ వైస్ చైర్మన్ కట్టెల సుభాష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎస్.హరినాథ్ రెడ్డి, శరత్, బి.కాంతారావు, ఎడ్ల నరేందర్‌రెడ్డి, సి.హెచ్.మురళీకృష్ణ, సాగర్‌రెడ్డి, దేవిరెడ్డి విజితారెడ్డి, హరినాథ్, ప్రభుదాస్, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాదిగలకు ఏఏజీ పోస్టును కేటాయించాలి

హిమాయత్‌నగర్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలో భాగంగా హైకోర్టులోని అడిషనల్ అడ్వకేట్ జనరల్ పోస్టును మాదిగలకు కేటాయించాలని మాదిగ రాజ్యాధికార పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు తిమ్మన నవీన్ రాజు మాదిగ డిమాండ్ చేశారు. మంగళవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశం అనంతరం బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో మాదిగలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలన్నారు. రెండు రోజుల క్రితం మినిస్టర్ క్వార్టర్స్‌లో మంత్రి దామోదర్ రాజనర్సింహని కలిసి మాదిగలకు ఉన్నత పదవుల హామీలపై చర్చించామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాదిగల ఉన్నత పదవుల హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఎంఎస్ఎఫ్ అధ్యక్షులు బి.ఉపేందర్, యువసేన సిటీ అధ్యక్షుడు జయరామరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ తేజ, రాష్ట్ర కన్వీనర్ రంజిత్, సునీల్, సుమంత్ కుమార్ లింగాల పాల్గొన్నారు.

చింతల అనసూయమ్మకు దత్తాత్రేయ నివాళి

బంజారాహిల్స్: ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి మాతృమూర్తి చింతల అనసూయమ్మ(98) ఇటీవల కన్నుమూశారు. ఆమె శ్రద్ధాంజలి కార్యక్రమాన్ని శుక్రవారం జలవిహార్‌లో నిర్వహించారు. హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయతో పాటు పలువురు బీజేపీ నేతలు, కార్యకర్తలు అనసూయమ్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి చింతల రామచంద్రారెడ్డిని, కుటుంబ సభ్యులను పరామర్శించారు.